తన భర్త తను చేసిన ప్రతి వంటకాన్ని రుచి చూసి, వుప్పు తక్కువైందనో లేదా ఎక్కువైందనో సాధిస్తున్నాడని, "అప్పడాలు వేయించటం కూడా రాని వాజెమ్మ నా పెళ్ళాం" అన్నాడట క్రితం రాత్రి. ఇద్దరిమధ్యా వాగ్యుద్ధం జరిగింది. తెల్లారేదాకా ఆగి భర్తని ఆఫీసుకి పంపించి, తను పుట్టింటికి వెళుతున్నానని చీటీరాసి పెట్టి బస్సులో వచ్చేసింది.

"నన్ను కొట్టినా, తిట్టినా పడతాను కాని నా వంటకి అలా వంకలు పెట్టటం మాత్రం సహించను. ఆయనకి బుద్ధివచ్చాక వచ్చి నన్ను తీసు కెళ్ళేదాకా వెళ్ళనండి" చెప్పింది ఆమె సుబ్బారావుకి.

సాయంత్రం పోస్టులో ఓ వుత్తరం వచ్చింది. అది సుబ్బారావు అరవై ఏళ్ళ అత్తగారు తన కూతురికి రాసింది కూతురికి రాసినా, కవరు మీద సుబ్బారావు పేరు రాయడం ఆవిడకి అలవాటు కాబట్టి ఆయన కవరు చించి చదివాడు. తర్వాత చిన్నగా నిట్టూర్చాడు. ఆ వుత్తరం సారాంశం....

"ఇన్నేళ్లొచ్చినా మీ నాన్నకి ఇంకా బుద్ధిరాలేదు. పరాయివాళ్ళ ముందు నన్ను నోటికొచ్చిన మాటంటారు. డైనింగ్ టేబొల్ మీద వలికిన కాఫీని వెంటనే తుడవలేదని ఒకటే సణుగుడు. నేను మా తమ్ముడింటికి వెళుతున్నాను. మళ్ళీ ఆయనంతట ఆయన వచ్చి, తప్పయిపోయిందని చెప్పి తీసుకెళితేకాని వెళ్ళను. మా తమ్ముడి ఇంటికే వుత్తరాలు రాస్తుండు...."

# పల్లెటూరి భార్య

నాకున్న మంచి స్నేహితుల్లో రాహుల్ ఒకడు. మా ఆఫీసులోనే చేరిన వారం రోజుల్లోనే అతను నాకు మంచి మిత్రుడయ్యాడు.

నాకొచ్చే జీతంలో వివాహం చేసుకొని సుఖంగా బ్రతకగలనా అనే అనుమానం వుండడంతో ఇంటినించి వుత్తరాలొస్తున్నా ముందరే కుదిరిన

సంబంధంవున్నా, పెళ్ళిని వాయిదా వేయసాగాను. పైగా వూరుకాని వూరు అయిన కలకత్తాలో పెద్దవాళ్ళ ఆర్థికబలం లేకుండా కాపురం పెట్టడానికి కొద్దిగా జంకుగా వుంది.

రాహుల్‌కి నా అనుమానాలు చెప్పాను. పెళ్ళి చేసుకోడానికి నన్ను ప్రోత్సహించింది అతనే నాకన్నా తక్కువ సంపాదించే వాళ్ళు పెళ్ళి చేసుకుని హాయిగా కాపురం చేస్తున్నారని, జీవితములో తప్పనిసరి అయిన ఆ అందమయిన భాగాన్ని వాయిదా వేయవద్దని ధైర్యం చెప్పాడు.

ఫలితంగా ఇంటికి వుత్తరం రాసాను పెద్దవాళ్ళు ముహూర్తం నిర్ణయించి వుత్తరం రాసారు. కలకత్తాలో నేనున్న సంవత్సరకాలంలో నాకు ఈజనుసుండీదాకా ఆ ఆప్తమిత్రులు లభ్యమయ్యారు. కోనసీమకి నాతో పాటు నా వివాహానికి వచ్చారు.

మా దూరపు బంధువే నా భార్య. పదవ తరగతి తప్పింది. పట్నవాస ఛాయ లెంతమాత్రం ఎరగని పల్లెటూరి పిల్ల. నేనంటే చిన్నప్పటి నుంచి పెంచుకున్న ప్రేమ పెళ్ళి సమయంలో ఆమె ప్రవర్తనలో, కళ్ళల్లో ప్రతీ చర్యలో గమనించి మురిసిపొయ్యాను.

వివాహం అయిన రెండు నెలలకి మా ఆఫీసు సమీపంలోనే చిన్న ఇల్లు తీసుకుని కాపురం పెట్టాను కాపురం పెట్టాక మిత్రులందరినీ మా యింటికి కాఫీకి పిలిచాను.

నా భార్య చేసిన కాఫీ నా స్నేహితులందరికీ నచ్చింది. అప్పటికప్పుడు వేయించి మిక్సర్‌లో పొడిచేసిన ఫిల్టర్ కాఫీ రుచి, బెంగాలి బాబులు ఆ కాఫీని ఎంతగానో మెచ్చుకున్నారు నా స్నేహితుల భార్యలలో కొందరికి స్వల్పంగా ఈర్ష్యకూడా కలిగిందనే చెప్పవచ్చు.

తరచూ మా యింటికి నా మిత్రులు రావడం, నా భార్య చేసే కాఫీ అడిగి మరీ తాగడం ఓ కార్యక్రమం అయిపోయింది. తన కాఫీని అందరూ మెచ్చుకోవడం నా భార్యకి గర్వంగాకూడా వుంది.

దాదాపు నాలుగు నెలల తర్వాత గమనించాను ఆ మార్పుని. ఇదివరలా నా మిత్రులు మా ఇంటికి తరచూ రావడంలేదు. నేను పిలిస్తే

ఏదో ఓ వంక చెప్పి తప్పించుకుంటున్నారు. వచ్చినా బిస్కెట్స్ తినటం తప్ప కాఫీ తాగడానికి ఉత్సాహం చూపించడంలేదు.

క్రమంగా నాలో బాధ కలిగి, అధికం అవసాగింది. నా మిత్రుల ప్రవర్తనకి నన్ను వాళ్ళంతా అలా ఎందుకు దూరం చేస్తున్నారో అర్థము కాలేదు. నాకు తెలీకుండా నా వెనక గుసగుసలాడుకుంటున్న ఫీలింగు. ఆ పరిస్థితి భరించలేక ఓ రోజు రాహుల్‌ని అడిగేశాను. ఎందుకిలా ప్రవర్తిస్తున్నారని.

రాహుల్ కొద్దిగా తటపటాయించాడు.

"నీ భార్యే కారణం" చెప్పాడు. "సారీ బ్రదర్. నీ భార్యలో ఓ వికారం వుంది"

"వికారమా?"

"అవును. సైకియాట్రిస్టుకి చూపించే ఆర్థిక బలం లేదు నీకు కాని అది కొనసాగడం మంచిదికాదు"

"అసలేమిటది"

"పల్లెటూరిలో పుట్టిపెరగడం చేత ఇలాంటి అలవాట్లు ఏర్పడిందేమో?" నీ భార్య మాకు కాఫీ ఇవ్వబోయేముందు ప్రతీసారి కప్పులోని కాఫీని ఎంగిలిచేసి ఇస్తోంది. ఆమె ఎంగిలి ఎలా తాగగలం చెప్పు?"

నాకు తల తిరిగినట్లయింది.

"ముందు మన అకౌంటెంట్ భార్య గమనించిందా సంగతి. తర్వాత మీ వంటగది కిటికీలోంచి దొంగతనంగా గమనించిన మా అందరికీ ఆ దృశ్యం కంటపడింది" చెప్పాడు.

ఆ సాయంత్రం ఇంటికెళ్ళాం నేను, రాహుల్, అతని భార్య. రాహుల్ భార్య కిటికీలోంచి గమనించి చెప్పింది. నా భార్య ఎప్పటిలా కాఫీ కప్పులను ఎంగిలి చేసిందని.

వంటగదిలోకి వెళ్ళాను. ఎంతో ప్రశాంతంగా వున్న నా భార్య మోహం చూస్తే "నిజమా?" అని అడగబుద్ధిగాలేదు. అయినాఅడిగాను.

"అవును ఎంగిలి చేస్తున్నాను. మీకెవరు చెప్పారు?" అడిగింది చప్పున తలపంచుకుని.

"ఎందుకు ఈ పాడుపని?" అడిగాను అసహ్యంగా.

నా భార్య కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. నా దగ్గరికి వచ్చి నా గుండెల మీద తలవాల్చి చెప్పింది.

"సారీ అండి, నా కాఫీ బావుందని వాళ్ళంతా వస్తుంటే, మీ సంపాదన మన పాల ఖర్చుకి సరిపోవటం లేదని మీకు చెప్పటం ఇష్టంలేక. మీకు మీ స్నేహితులంటే ఎంత ఇష్టమో నాకు తెలుసు అందుకని వాళ్ళు చూసేలా ఎంగిలిచేసి ఇస్తున్నాను ఇంకెప్పుడూ రారని"

నేను నా భార్య గడ్డం పట్టుకుని తలెత్తి ఆమె కళ్ళలోకి చూశాను.

పల్లెటూరి పిల్లలో వుండే అమాయకత్వం కనిపించింది నాకు వాటిలో. కళ్ళ నీళ్ళు తుడిచి చెప్పాను.

"తప్పు కదా?"

"మా అమ్మ చెప్పిందండి ఈ వుపాయం. పెళ్ళయి సిటీలో వుండే మా వూరి అమ్మాయిలంతా డబ్బు చాలకపోతే ఇలా చేస్తారని వుత్తరము రాసింది."

రాహుల్‌కి జరిగింది చెప్పి, నా మిత్రులు ఎప్పటిలా నా ఇంటికి కాఫీకి వస్తుంటేనే వాళ్ళు నన్ను క్షమించినట్లు అని చెప్పాను. ఇది జరిగి ఎనిమిదేళ్ళయినా, ఇప్పుడు నేను వైజాగ్‌కి బదిలీ అయిపోయినా నా కలకత్తా మిత్రులు ఈ సంఘటన ఇంకా మర్చిపోలేదు.

## భార్య

అర్ధరాత్రి ఫోన్ మోగితే విసుక్కుంటూ అందుకుని "హలో" అన్నాను.

శివలీల

"మీ ఫ్రెండ్ పోయారు. ఓసారి వస్తారా?"

శివలీల కంఠాన్నిబట్టి గురునాధ్ చచ్చిపోయారని అర్థమయిందినాకు.

* * * *